

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
సోమవారం 8 ఏప్రిల్ 2024





## చంద్రన్న బీమాతో ఎంతో లబ్ధి



చంద్రన్న బీమాతో పేదలకు ఎంతో లబ్ధి చేకూరింది. ఎవరైనా ప్రమాద వశాత్తు మరణిస్తే బీమా ద్వారా తక్షణసాయం కింద కూడా దహన సంస్కారాలకు సాయం అందించే వారు. ప్రస్తుతం వైఎస్ఆర్ బీమా కింద సాయం అందట్లేదు. టీడీపీ హయాంలో రేషన్‌కార్డులోని సభ్యులందరికీ వర్తింపజేస్తే వైఎస్ఆర్ బీమాలో ఒక్కరికే అవకాశం కల్పిస్తున్నారు.

**- మాధవరెడ్డి, ధర్మవరం**

## వైఎస్ఆర్ బీమా.. దగా



వైఎస్ఆర్ బీమా.. దగా బీమాగా తయారైంది. టీడీపీ హయాంలో చంద్రన్న బీమా ద్వారా కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ తక్షణమే ప్రయోజనం చేకూరేది. వైఎస్ఆర్ బీమా ద్వారా ఇంట్లో ఒక్కరికే, అదికూడా అంతంతమాత్రంగానే ఆర్థిక భరోసా కల్పించారు. కొందరికైతే బీమా లబ్ధి అందక ఏళ్లుగా ఎదురుచూస్తూనే ఉన్నారు.

**- కొలసాని చంద్ర, నల్లచెర్లోపల్లి, ముదిగుబ్బ మండలం**

**నాడు చంద్రన్న బీమాతో లబ్ధి**

- ఎందరికో ఆసరాగా నిలిచిన వైనం
- కుటుంబ సభ్యులందరికీ వర్తింపు
- వైసీపీ పాలనలో ఒక్కరికే చాన్స్
- అది కూడా అందని దుస్థితి







# బీమా.. ఏదీ ధీమా?

**ధర్మవరం, ఏప్రిల్ 7:** కుటుంబంలో ఎవరు ప్రమాదం బారిన పడినా టీడీపీ హయాంలో చంద్రన్న బీమా అందజేసేవారు. సహజ మరణమైనా, ప్రమాదమైనా అదేరోజు ఆ కుటుంబానికి సాయం అందించేవారు. వైసీపీ అధికారంలోకి రాగానే బీమా పథకాన్ని అటకెక్కించారు. వైఎస్ఆర్ బీమా అంటూ పేరు మార్చారు. నామమాత్రం చేశారు. కంటితుడుపు చర్యగా మారడంతో ఆ పథకం పూర్తిగా నిర్వీర్యమయ్యే దశకు చేరుకుంది. చంద్రన్న బీమా కుటుంబంలోని అందరికీ వర్తించేది. వైఎస్ఆర్ బీమా మాత్రం కుటుంబంలో ఒక్కరికే వర్తింపజేశారు. ఆ లబ్ధి కూడా చేకూర్చకపోవడంతో పేద కుటుంబాలు కష్ట సమయంలో ఆసరా కోల్పోయి, రోడ్డున పడుతున్నాయి. కుటుంబంలోని వ్యక్తి ప్రమాదంలో మరణిస్తే ఖననం కోసం అయ్యే ఖర్చు గురించి ఆలోచించేలోపే చంద్రన్న బీమా ద్వారా తక్షణ సాయంకింద నేరుగా ఇంటికి వచ్చి సొమ్ము అందించేవారు. ప్రస్తుతం వైఎస్ఆర్ బీమా నీరుగారిపోవడంతో పేదలు గగ్గోలు పెట్టే పరిస్థితి ఏర్పడింది. చంద్రన్న బీమా ఎప్పుడెప్పుడు వస్తుందా అని ప్రజలు ఎదురుచూసే పరిస్థితి నెలకొంది.

### చంద్రన్న బీమాతో భారీగా లబ్ధి

కుటుంబంలో ఎవరైనా మరణిస్తే వారికి భరోసా కల్పించడానికి టీడీపీ హయాంలో చంద్రన్న బీమా పథకాన్ని ప్రవేశపెట్టారు. రేషన్‌కార్డు ఉన్న ప్రతి లబ్ధిదారుడికి ఈ పథకం వర్తించేది. ఆ రేషన్‌కార్డులో ఎంతమంది ఉన్నా.. వారందరికీ వరంగా ఉండేది. జిల్లాలో 5లక్షలకుపైగా రేషన్‌కార్డులు ఉన్నాయి. వీటి ద్వారా 88,502 మంది దాకా లబ్ధి పొందినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. సహజ మరణానికి రూ.30వేలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2లక్షల నుంచి రూ.5లక్షలదాకా ఆ కుటుంబానికి చంద్రన్న బీమా అందేది. వైఎస్ఆర్ బీమా ద్వారా ఇప్పటివరకు కేవలం 16,432 మందికి మాత్రమే లబ్ధి చేకూరినట్లు తెలుస్తోంది. వైఎస్ఆర్ బీమా ద్వారా రేషన్‌కార్డులో ఒకరికే అవకాశం కల్పించడంతో మిగిలిన వారికి మొండిచెయ్యి చూపినట్లయింది. తద్వారా ఆ పేద కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. ఈ అర్థం లేని నిబంధనతో బీమా పథకం లబ్ధి చేకూరట్లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# నీటి కష్టాలు..!

**తాడిమర్రి, ఏప్రిల్ 7:** జిల్లాకు తాగునీరు అందిస్తున్న ప్లాంట్లు కూతవేటు దూరంలో ఉన్నా మండలంలోని చిల్లకొండయ్యపల్లికి మాత్రం నీటి ఎద్దడి తప్పడంలేదు. గ్రామంలోని ఎస్సీ కాలనీకి నీటి సరఫరా పూర్తిగా ఆగిపోయింది. సత్యసాయి నీరు అరకొరగా వస్తున్నా.. పంచాయతీ నీరు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఎగువ ప్రాంతంలోని ఎస్సీ కాలనీకి నీరు అందడంలేదు. దీంతో కాలనీవాసులను నీటి కష్టాలు చుట్టుముట్టాయి. వారు పులివెందుల-ధర్మవరం ప్రధాన రహదారి వరకు వచ్చి నీరు తీసుకెళ్లాల్సి వస్తోంది. రోజూ బిందెలు తీసుకుని, కిలోమీటరు మేర నీటి కోసం వెళ్లాల్సి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. అక్కడ కొళాయిల వద్ద రాత్రిళ్లు కూడా పడిగాపులు కాసి, మరీ నీటిని తెచ్చుకుంటున్నారు.



చిల్లకొండయ్యపల్లిలో రాత్రిపూట తాగునీటి కోసం కొళాయిల వద్ద వేచివున్న మహిళలు

- కళ్లెదుటే నీటి ప్రవాహం
- మడకశిర ప్రాంతం నుంచి కర్ణాటక చెరువుల్లోకి..
- మడకశిరకు మళ్లించడంలో విఫలం
- సప్లై చానళ్ల నిర్మాణం, నిర్వహణలో నిర్లక్ష్యం
- ఐదేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితం
- పాలకుల నిర్లక్ష్యంలో ప్రజలకు నీటి కష్టాలు



# నీళ్లొదిలేస్తున్నారు..!



ఎండిపోయిన చెరువు

**మడకశిర, ఏప్రిల్ 7:** కళ్లెదుటే నీటి ప్రవాహం వెళ్తోంది. మడకశిర ప్రాంతంలో నేలరాలిన వర్షపు నీరు కర్ణాటక చెరువుల్లోకి వెళ్తోంది. ఆ నీటికి అడ్డుకట్ట వేసి, మడకశిర ప్రాంత చెరువులకు మళ్లించడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా ఆ ప్రాంత వాసులకు తాగునీటి కష్టాలు తలెత్తాయి. కాలువలు, నదులు కోతకు గురికావడం, చెక్‌డ్యాంలు, కుంటల తెగిపోవడంతో నీరు వృథాగా పోతోంది. భారీ వర్షాల కురవడంతో రెండేళ్ల క్రితం తాగునీటి సమస్య ఉత్పన్నం కాలేదు. గతేడాది తీవ్ర వర్షాభావం చుట్టుముట్టింది. దీంతో నియోజకవర్గంలో భూగర్భ జలాలు అడుగంటిపోయి, తాగు, సాగు నీటి సమస్య తీవ్రరూపం దాల్చుతోంది. 1000 అడుగులు తవ్వినా చుక్క నీరు దొరకడం కష్టసాధ్యంగా మారింది. సాగు చేసిన పంటలను కాపాడుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లక్షలాది రూపాయలు అప్పులు చేసి, బోర్లు తవ్వించినా చుక్కనీరు దొరకడం లేదు. దీంతో బోర్ల కింద పంటల సాగు కూడా తగ్గుతోంది. దశాబ్దకాలంగా ఈ ప్రాంత రైతులు సాగు, తాగునీటికి ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. మడకశిర ప్రాంతం సముద్ర మట్టానికి చాలా ఎత్తులో ఉండడంతో కురిసిన వర్షపు నీరంతా దిగువ ప్రాంతంలోని కర్ణాటక చెరువులు, కుంటలకు చేరుతోంది.

### పూడిక తొలగిస్తే చెరువుకు నీరు



కొడగార్లగుట్ట సప్లైచానల్‌లో పూడిక, కంపచెట్లు తొలగించకపోవడంతో నీరు వృథా అవుతోంది. వర్షాలు కురిసినా రొళ్ల చెరువుకు నీరు చేరడం లేదు. హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు తీసుకొచ్చి, చెరువులు నింపితే తాగు, సాగు నీటి సమస్య పరిష్కారం అవుతుంది. కాలువలో పూడికను తొలగించాలి.

**- లక్ష్మీనరసప్ప, రైతు, రొళ్ల మండలం**

ఆ నీటిని సప్లై చానళ్ల ద్వారా మళ్లించి, మడకశిర ప్రాంతంలోని చెరువులు నింపేందుకు గతంలో నిధులు మంజూరయ్యాయి. టెండర్లు, అగ్రిమెంట్ల దశలోనే ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో మంజూరైన నిధులు కూడా పనులు సాగక వెనక్కు మళ్లిపోయాయి. నీరు-చెట్టు పథకం కింద చెరువులు, కాలువల్లో పూడికతీత, కంపచెట్ల తొలగింపునకు ఐదేళ్ల క్రితం లక్షలాది రూపాయలు మంజూరు చేశారు. ఆ పనులు రద్దవడంతో అగళి, రొళ్ల, అమరాపురం, గుడిబండ, మడకశిర మండలాల్లోని పలు ప్రాంతాల్లో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. తాగు, సాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. ఎనిమిది పంవత్సరాల క్రితం గుడిబండ, రొళ్ల మండలాల్లో వృథాగా వెళ్తున్న నీటిని అడ్డుకునేందుకు వాటర్‌షెడ్ కింద కోట్లాది రూపాయలతో చెక్ డ్యాంలు, కుంటల నిర్మాణం చేపట్టారు. పలుచోట్ల చెక్ డ్యాంలు నాసిరకంగా నిర్మించడం, మరికొన్ని చోట్ల కట్టకనే నిధులు స్వాహా చేశారు. రొళ్ల మండలంలో రూ.80 లక్షల నిధులు దుర్వినియోగమైనట్లు అప్పట్లో నిర్వహించిన సామాజిక తనిఖీలో వెల్లడైంది. ఆ మండలాల్లో వృథాగా వెళ్లే నీటికి అడ్డుకట్ట వేసి, భూగర్భజలాలు పెంపొందించే చర్యలు చేపడితే రానున్న రోజుల్లో వర్షపు నీరు ఇంకి, భూగర్భజలమట్టం పెరిగి తాగు, సాగునీటి సమస్య పరిష్కారమయ్యే ఆస్కారం ఉంటుంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి, వర్షాలు కురవక ముందే వాటికి మరమ్మతులు చేపట్టి, నీటికి అడ్డుకట్ట వేయాలని రైతులు కోరుతున్నారు.

**రూ.2కోట్ల దాకా వెనక్కి..**

అమరాపురం మండలంలోని తమడేపల్లి, గుడిబండ మండలంలో మోరుబాగల్ సప్లైచానళ్ల నుంచి నీటిని ఈ ప్రాంతంలోని చెరువులకు మళ్లించేందుకు పదేళ్ల క్రితం రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. రెండుమార్లు టెండర్లు కూడా పూర్తయ్యాయి. పనులు సాగకపోవడంతో ఆ నిధులు వెనక్కు మళ్లాయి. దీంతో నాచేపల్లి సప్లైచానల్ నుంచి కర్ణాటకలోని దొడ్డబాణగెర చెరువుకు నీరు వెళ్తోంది. ఆ నీటిని మళ్లిస్తే తమ్మడేపల్లి చెరువుకు నీరు చేరుతుంది. మోరుబాగల్ సప్లైచానల్ నీరు కూడా మళ్లించకపోవడంతో దిగువ ప్రాంతంలోని కర్ణాటక చెరువులకు చేరుతోంది.

### ప్రతిపాదనలకే పరిమితం

రొళ్ల మండలం హొట్టేబెట్ట నుంచి గంగలవాయిపాళ్యం, గోవిందాపురం మీదుగా వచ్చే నీరు మడకశిర చెరువులకు మళ్లించేందుకు పదేళ్ల క్రితం అంచనాలు తయారుచేసి, ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరు కాకపోవడంతో ప్రతిపాదనలకే పరిమితమైంది. ఆ సప్లైచానల్ నీరు మడకశిర చెరువుకు మళ్లిస్తే కొద్దిపాటి వర్షం వచ్చినా నీరు చేరుతుంది. తద్వారా భూగర్భజలాలు పెరిగి నీటి సమస్య పరిష్కారం అవుతుంది. మడకశిర పట్టణానికి తాగునీటి సమస్య తీరుతుంది. ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది వర్షాలు అంతంతమాత్రంగానే కురవడం, చెరువులకు నీరు చేరకపోవడంతో ఆయకట్టు బీడుగా మారడమే కాకుండా పట్టణానికి తాగునీరు అందించే బోర్లు కూడా ఎండిపోయాయి.

అగళి మండలంలో స్వర్ణముఖి నది కూడా రెండేళ్ల క్రితం కురిసిన వర్షాలకు కోతకు లోనైంది. చిన్న వర్షం వచ్చినా నీరు వృథాగా వెళ్తోంది. ఈ సప్లైచానళ్లకు మరమ్మతులు చేసి, వాటిని ఈ ప్రాంత చెరువులకు మళ్లిస్తే శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారమవుతుంది. నీరు లేక చెరువులు ఎండిపోవడంతో భూగర్భజలాలు అడుగంటి పోయాయి. బోరుబావులు ఎండిపోతున్నాయి. ఒక్క హెచ్‌డీ హళ్లి పంచాయతీలోనే 30 బోర్లకుగాను ఒక్క దాంట్లో మాత్రమే అరకొరగా నీరు పడింది. రొళ్ల మండలం కొడగార్లగుట్ట కాలువలో పూడిక పేరుకుపోయి, కంపచెట్లు పెరిగిపోయాయి. దీంతో వర్షాలు కురిసి కాలువలు పారితే నీరంతా వృథా అవుతుంది. పూడిక, కంపచెట్లు తొలగిస్తే వర్షపు నీరు రొళ్ల చెరువుకు చేరుతుంది. తద్వారా తాగు, సాగు నీటి సమస్య పరిష్కారం అవుతుందని రైతన్నలు అంటున్నారు.



రెండేళ్ల క్రితం కోతకు గురైన నది



కొడగార్లగుట్ట సప్లై చానల్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

## ఎన్నికల కోడ్‌పై అవగాహన అవసరం

**కలెక్టర్ అరుణ్‌బాబు**

**పుట్టపర్తి, ఏప్రిల్ 7:** ఎన్నికల కోడ్ అమలుపై అవగాహన తప్పక కలిగి ఉండాలనీ, అప్పుడే పొరబాట్లకు తావుండదని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై నోడల్ అధికారులతో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. త్వరలోనే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందనీ, ఇందుకు అందరూ సంసిద్ధంగా ఉండాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఆయా ఎన్నికల రూట్లలో ఏర్పాట్లపై సమీక్షించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, సబ్‌కలెక్టర్ అపూర్వభరత్, డీఆర్వో కొండయ్య, నియోజకవర్గాల ఎన్నికల అధికారులు వెంకటశివరామిరెడ్డి, వంశీకృష్ణ, భాగ్యరేఖ, గౌరీశంకర్, 27 మంది నోడల్ అధికారులు పాల్గొన్నారు.

**ఉష్ణోగ్రతలు (ఆది)**

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| పుట్టపర్తి | 40.0 | 26.0 |
| కదిరి | 41.0 | 26.0 |
| ధర్మవరం | 41.0 | 26.0 |
| హిందూపురం | 38.0 | 24.0 |
| పెనుకొండ | 39.0 | 25.0 |

### ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలి

జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అందరి సహకారం అవసరమని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 18న ప్రారంభంకానున్న ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. శాసనసభ స్థానాలకు ఆయా నియోజకవర్గ కేంద్రాలు, ఎంపీకి కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. కొత్తగా జిల్లాలో 6వేల ఓట్లు పెరిగాయన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఫారం-6 ద్వారా ఓటు కోసం నమోదు చేసుకోవచ్చన్నారు. జిల్లాలో 299 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నాయనీ, వీటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ట్రైనింగ్ రోజే ఓటు వేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, సమాచార శాఖ ఏడీ వేలాయుధం పాల్గొన్నారు.

## 2 నెలలైనా.. తీరని కష్టం

**మడకశిర రూరల్, ఏప్రిల్ 7:** మండలంలోని గుడ్డంపల్లి, యూ.రంగాపురం గ్రామాల ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న బోర్లలో నీరు రావడంలేదు. కొత్తబోర్లు వేయకపోవడంతో నీటి కష్టాలు తలెత్తాయి. నీటి కోసం వ్యవసాయబోర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. గుడ్డంపల్లి, యూ.రంగాపురం వాసులు.. తాగునీటి సమస్య పరిష్కరించాలని రెండు నెలల క్రితం మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీశారు. అప్పట్లో కొత్తబోర్లు వేస్తామనీ, అప్పటి వరకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు హామీ ఇచ్చారు. రెండు నెలలైనా సమస్య తీర్చలేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఆదివారం గుడ్డంపల్లి ఎస్సీ కాలనీకి ఒకే ఒక ట్యాంకర్ తాగునీటిని పంపారు. దీంతో ట్యాంకర్‌ను జనం చుట్టుముట్టారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



గుడ్డంపల్లి ఎస్సీ కాలనీలో ట్యాంకర్ వద్ద తాగునీటి కోసం భారీగా ఉంచిన బిందెలు



ఏఎస్ఐ వెంకటరమణ చెవికి గాయం

# శ్మశానవాటికలో వీరంగం

**పోలీసులకు గాయాలు.. వాహనం ధ్వంసం**

ధ్వంసమైన పోలీస్ జీపు





**హిందూపురం, ఏప్రిల్ 7:** పట్టణంలోని ఓ వర్గానికి చెందిన వారు శ్మశానవాటిక వద్ద శనివారం అర్ధరాత్రి వీరంగం సృష్టించారు. వన్‌టౌన్ సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. ఓ వర్గానికి చెందిన కొంతమంది హస్నాబాద్‌లోని శ్మశానవాటికకు వెళ్లారు. అక్కడే ఉన్న ప్రార్థనా మందిరానికి వెళ్లిన అదే వర్గానికి చెందిన మరికొందరిపై తిరగబడ్డారు. దాడులు చేశారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ ఏఎస్ఐ వెంకటరమణ, కానిస్టేబుల్ పెక్షావలి అక్కడికి చేరుకున్నారు. ఇరువర్గాలు ఘర్షణ పడుతుండగా సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో కొంతమంది.. పోలీసు జీపు ఎక్కి, ధ్వంసం చేశారు. జీపు అద్దాలు పగలకొట్టి, సీట్లు విరగ్గొట్టి వైర్లు తెంచేశారు. ఏఎస్ఐ, కానిస్టేబుల్‌పై దాడికి తెగబడ్డారు. వారిద్దరికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మరికొంత మంది పోలీసులు అక్కడకు చేరుకుని, గాయపడిన ఏఎస్ఐ, కానిస్టేబుల్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులను కిందపడేసి దాడి చేయడంతో రక్తగాయాలయ్యాయన్నారు. అక్కడికెళ్లిన మత పెద్దలపై కూడా కొంతమంది తిరగబడ్డారు. ఈ శ్మశానవాటికలో ఇలాంటి ఘర్షణలు సాధారణమయ్యాయన్నారు. పోలీసులపై దాడికి సంబంధించి హత్యాయత్నం కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ప్రార్థనకు వెళ్లిన వారిపై దాడికి సంబంధించి కూడా కేసు నమోదు చేశామన్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నట్లు తెలిపారు. దీనిని ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణిస్తున్నట్లు సీఐ తెలిపారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏఎస్ఐ, కానిస్టేబుల్

**రంజాన్ వేళలు**



| | ఇఫ్తార్ | సెహరీ |
|---|---|---|
| పుట్టపర్తి | 6.36 సోమవారం (సాయంత్రం) | 4.48 మంగళవారం (ఉదయం) |
| కదిరి | 6.3 సోమవారం (సాయంత్రం) | 4.54 మంగళవారం (ఉదయం) |
| ధర్మవరం | 6.38 సోమవారం (సాయంత్రం) | 4.51 మంగళవారం (ఉదయం) |
| హిందూపురం | 6.36 సోమవారం (సాయంత్రం) | 4.55 మంగళవారం (ఉదయం) |
| పెనుకొండ | 6.34 సోమవారం (సాయంత్రం) | 4.52 మంగళవారం (ఉదయం) |

# విద్యార్థిని విలాపం



- గుంతకల్లు కేజీబీవీలో అక్రమాల పర్వం
- విద్యార్థినులకు సక్రమంగా అందని ఆహారం
- వంటలు వండకుండానే ఫొటోలు షేర్..
- విచారణలో బయటపడినా చర్యలేవీ?

**గుంతకల్లు, ఏప్రిల్7:** పట్టణంలోని కస్తూర్బా బాలికా విద్యాలయం (కేజీబీవీ) అక్రమాలకు అలవాలంగా మారింది. విద్యార్థులకు సక్రమంగా ఆహారాన్ని అందించక పోగా, అసలు మెనూ ప్రకారం వండకుండానే వండినట్లుగా వాట్సాప్‌లో ఫొటోలు పెట్టి ఉన్నతాధికారులను బురిడీ కొట్టించారు. పులిహోర ఉంటే చట్నీలేదు, చట్నీ ఉంటే పూరీ లేకుండా ఆహారం అందిస్తున్నారు. అధికారుల తనిఖీలో అక్రమాలు బయటపడినా ఇంతవరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో ఈ విద్యాలయంలో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించగా ఇందులో పనిచేస్తున్న పీఈటీని సస్పెండ్ చేశారు. విద్యాశాఖాధికారులు ఏళ్లుగా నిర్లక్ష్యం వహిస్తున్న కారణంగా కేజీబీవీ నిర్వహణ నడి సముద్రంలో చుక్కానిలేని నావ చందంగా తయారైంది.

### వంట చేయకనే ఫొటోలు..

కేజీబీవీలో బోధన బాగా ఉంటుందన్న నమ్మకంతో తల్లి దండ్రులు ఆహార నాణ్యతపై దృష్టి పెట్టలేదు. ఓ ఘటనలో విద్యాలయంలో జరుగుతున్న అక్రమాలు వెల్లడికావడంతో మరీ ఇంత ఘోరమా.. అంటూ విద్యార్థినుల తల్లి దండ్రులు అవాక్కయ్యారు. గతనెల 31వ తేదీన కేజీబీవీలో నీటి సమస్య ఏర్పడి విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఫిర్యాదు రావడంతో ఉన్నతాధికారులు ఈనెల 1వ తేదీన కేజీబీవీని సందర్శించి విచారణ చేపట్టారు. విద్యార్థినులతో జీసీడీఓ మహేశ్వరి రహస్యంగా ఫిర్యాదులను సేకరించారు. అధ్వానమైన ఆహారాన్ని అందిస్తున్నారంటూ విద్యార్థులు తమ పేర్లు రాయ కుండా చీటీల్లో ఫిర్యాదులు రాసి బాక్సులో వేశారు. దీనిపై వంటవారిని, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించగా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. విద్యాలయంలో విద్యార్థులకు అసలు పూరీ వంటకాన్నే చేయకుండా చేసినట్లుగా రికార్డు చేస్తున్నట్లు వంటవారు జీసీడీఓకు ఫిర్యాదు చేశారు. పైగా విచారణ జరిగినరోజే పులిహోరలోకి చట్నీ చేసినట్లుగా చట్నీ గిన్నె ఫొటోను లొకేషన్‌తోపాటు కేజీబీవీ వాట్సాప్ గ్రూపులోకి షేర్ చేసిన విషయం బహిర్గతమైంది. పూరీ విషయంలోనూ ఇలాగే జరిగింది. ఈ తతంగం ఏళ్ల తరబడి నడుస్తున్నట్లు గుమనించారు.



పనిచేయని నీటి శుద్ధి ప్లాంట్



గుంతకల్లు కేజీబీవీ

### ప్రశ్నిస్తే పోలీసులకు ఫిర్యాదు

కేజీబీవీలో జరుగుతున్న అక్రమాన్ని ఎవరైనా ప్రశ్నించాలని చూసినా, ఆకస్మికంగా విద్యాలయానికి వచ్చి వంటకాలను పరిశీలించాలని యత్నించినా పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారని, కేసు పెడతామంటూ బెదిరిస్తున్నారని విద్యార్థినుల తలిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యాలయ కమిటీ ఛైర్‌పర్సన్ నూర్జహాన్, ఆమె భర్త మార్చి 31న కేజీబీవీకి వచ్చి తాగునీటి సమస్య ఉందని గమనించారు. ట్యాంకులో నీరు అయిపోవడంతో విద్యార్థినులు ఆదివారం బట్టలు ఉతకడానికి, స్నానాలు చేయడానికి నీరు లేక అవస్థలు పడుతుండటంతో వాటర్ ట్యాంకరును తెప్పించారు. వంటగదిలోకి వెళ్లి ఆహారం ఎలా ఉందో పరిశీలించారు. ఈ విషయం తెలుసుకున్న కేజీబీవీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తమపై పోలీసులకు ఫిర్యాదుచేశారని, పోలీసుల నుంచి తమకు ఫోన్ వచ్చిందని వాపోయారు. తల్లిదండ్రులు వచ్చినా వారిపై కేసులు పెట్టాలని చూడటం ఘోరమని ఫిర్యాదుచేశారు.

### తాగునీటికి కటకట

గుంతకల్లు కేజీవీబీలో విద్యార్థినుల తాగునీటి కోసం నీటి శుద్ధి యంత్రాన్ని బిగించారు. కానీ అది లీకవుతుండటంతో ఇక్కడ తాగు నీటికి సమస్యగానే ఉంటోంది. యంత్రాన్ని రన్ చేసినప్పుడు మాత్రమే తాగునీరు దొరికే అవకాశం ఉంది. ఒకవేళ కరెంట్ పోతే తాగునీళ్లు రావు..అన్నం తినే సమయంలోనూ అదే పరిస్థితి తప్పక పోవడం దారునం కేజీబీవీ నిర్వహణ ఇంత అధ్వానంగా ఉండగా, ఫిర్యాదులు తీసుకున్న ఉన్నతాధికారులు ఇంతవరకూ చర్యలు తీసుకోకపోవడం మరింత దారుణం. ఇదిలా ఉండగా తనను అవమానించారంటూ ఓ విద్యార్థిని నాలుగు రోజుల కిందట ఆత్మహత్యా యత్నానికి పాల్పడగా, విచారణ చేసిన అధికారులు పీఈటీని సస్పెండ్ చేశారు.

### అన్నం బాగా లేకపోయినా ఊరుకున్నాం : ఛైర్‌పర్సన్ నూర్జహాన్



కేజీబీవీలో అన్నం సక్రమంగా ఉడక్క విద్యార్థినులు అవస్థలుపడుతు న్నా, చదువులు బాగా ఉంటాయన్న ఒకే ఒక్క కారణంగా తల్లిదండ్రులము ఊరికే ఉన్నాము. నీరు కూడా ఇవ్వలేరా అని ప్రశ్నించినందుకు అనుమతి లేకుండా లోనికి వస్తున్నారంటూ మాపైనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పిల్లలకు ఆహారాన్ని ఇవ్వకుండా ఇచ్చినట్లుగా రికార్డులు రాయడం మరీ ఘోరం దీనిపై చర్యలు తీసుకోవాలి.

# హలీంకు అనంత సలాం..!



- రంజాన్ నెలలో అత్యంత ప్రీతికరమైన వంట
- నెలరోజులుగా కిటకిటలాడిన హోటళ్లు
- రుచితోపాటు ఆరోగ్యం..

**అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్7 :** రంజాన్ అంటేనే గుర్తుకొచ్చే వంటకాల్లో ముఖ్యమైనది హలీమ్. నెలరోజులుగా హలీం సెంటర్లు కిటకిటలాడుతున్నాయి. రంజాన్ ఉపవాసం ముగియగానే ముస్లింలు హలీమ్ తినడం ఆనవాయితీ. అయితే హలీమ్ రుచులకు అన్నివర్గాలు దాసోహం అయ్యాయి. చికెన్, మటన్‌లతో తయారు చేసే ఈ వంటకానికి అంత క్రేజ్ ఉంది. మహానగరాలకే పరిమితమైన ఈ వంటకం రానురానూ అన్ని ప్రాంతాలకు విస్తరించి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. నగరంలోని మెహ్ఫిల్ రెస్టారెంట్, స్పెషల్ అరబ్ జఫ్రానీ హలీమ్, సుభాష్‌రోడ్డులోని పలు సెంటర్ల నిర్వాహకులు ప్రత్యేకంగా హైదరాబాద్, అరేబియన్ వంట మాస్టర్లను పిలిపించి మరీ రెస్టారెంట్, హలీం సెంటర్ల నిర్వాహకులు తయారు చేయిస్తుండంతో ఆ రుచులకు ఆహార ప్రేమికులు దాసోహం అవుతున్నారు.



హలీం సెంటర్ వద్ద జనం కిటకిట..

### హలీం ఎలా మొదలైంది..?

రంజాన్ మాసంలోనే లభించే అత్యంత రుచికరమైన వంటకమిది. ఈ వంటకాన్ని అరేబియన్స్ ప్రజల ముందుకు తీసుకొచ్చారు. ఈ హలీంకు హరీస్ అని మరో పేరు ఉంది. 10వ శతాబ్దంలో కితాబ్ అల్ తబిక్‌లో హలీమ్ రెసిపి గురించి తొలిసారిగా రాశారు. హైదరాబాద్ నిజాం ఆర్మీ దగ్గర ఉండే అరేబియన్ సైన్యం మొట్టమొదటి సారిగా భారత్‌లోకి తీసుకొచ్చినట్లు సమాచారం. అప్పటి నుంచి ప్రతి రంజాన్ మాసంలో హలీమ్ ప్రతి రెస్టారెంట్లలో తయారు చేయడం మొదలుపెట్టారు. ఒకప్పుడు మహానగరాల్లో లభించే ఆ హలీం ప్రస్తుతం అన్ని చోట్లా లభిస్తోంది.



చికెన్ షేర్వా తయారీ..

### తయారీ విధానం...

హలీం తయారీలో అత్యధిక పోషకాలు కలిగిన డ్రై ఫ్రూట్స్‌తో పాటు చికెన్, మటన్, ఆరోగ్యానికి హానికరం కాని మసాల దినుసులను వాడతారు. చికెన్, మటన్‌లతో పాటు గోధుమలు, నెయ్యి, అల్లం వెల్లుల్లి పేస్ట్, పసుపు, శనగపప్పు, మినపప్పు, ధనియాలు, జీలకర్ర, వాము, దాల్చిన చెక్క, యాలకులు, లవంగాలు, నల్ల మిరియాలు, కుంకుమ పువ్వు, బెల్లంతో పాటు డ్రై ఫ్రూట్స్ పిస్తా, జీడిపప్పు, అంజీరా, బాదం పప్పు, కొత్తిమీర, ఫ్రైడ్ ఉల్లిపాయలు, నిమ్మకాయల కలయికలతో ఈ హలీం తయారు చేస్తున్నారు. గోధుమలు, పప్పులు రాత్రంతా నానబెట్టి బాగా ఉడికించుకుంటారు. మటన్, చికెన్‌ను ఖైమాలాగా చేసుకొని ఉడికించుకొని... అన్ని రకాల మసాలా వేసి గ్రేవీ మాదిరిగా తయారు చేస్తారు. వీటిలో గోధుమలు, పప్పుల మిశ్రమం, ఉడికించుకున్న చికెన్, మటన్‌లను గ్రేవీలో వేసి దాదాపు 6 నుంచి 7 గంటల వరకూ వరకూ గుమగుమలాడే సువాసనలు వచ్చేవరకూ ఉడికించి తయారు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలుపుతున్నారు.

### ఐదేళ్లుగా హలీం తయారు చేస్తున్నాం... : తాజుద్దీన్, మెహ్ఫిల్ హలీమ్ సెంటర్



ప్రతి రంజాన్ మాసంలో నగర ప్రజల కోసం చికెన్, మటన్ హలీం తయారు చేయిస్తున్నాం. వీటితో పాటు చికెన్ షవర్మా, చికెన్ స్పెషల్ తందూరీ ఐటమ్‌లను అందజేస్తున్నాం. వీటి తయారీకోసం హైదరాబాదు నుంచి వంటమాస్టర్లను రప్పిస్తున్నాం. అనంతలో బాగా ఆదరిస్తున్నారు.

### జఫ్రానీ హలీం పరిచయం చేశాం... : ఆరీఫ్, స్పెషల్ అరబ్ జఫ్రానీ హలీం సెంటర్



హలీంలో జఫ్రానీ హలీమ్‌కు క్రేజ్ ఉంది. వీటితో వాడే మసాల దినుసులు, డ్రై ఫ్రూట్స్‌ను హైదరాబాద్ నుంచి తెప్పించి తయారు చేయిస్తున్నాం. అనంతలో మొదటిసారిగా జఫ్రానీ హలీం ప్రజల ముందుకు తీసుకొచ్చాం. వీటి కోసం ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. అద్భుతమైన రుచితోపాటు ఆరోగ్యం లభిస్తోంది.

## మున్సిపల్ కమిషనర్ వీరంగం..!



మహిళలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కమిషనర్ కిషోర్

**రాయదుర్గంటౌన్, ఏప్రిల్ 7:** పట్టణంలోని ఆరో వార్డులో మున్సిపల్ కమిషనర్ కిషోర్ ఆదివారం వీరంగం సృష్టించారు. ఆ వార్డు మహిళలు తెలిపిన వివరాలివి. ఐదురోజులుగా తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నామనీ, సమస్యను పరిష్కరించాలని కోరిన మహిళలపై మున్సిపల్ కమిషనర్ కిషోర్ దూషణకు దిగారు. తాగునీటి విషయంలో రాజకీయం చేస్తున్నారంటూ మహిళలపై మండిపడ్డారు. కేసులు బనాయించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నీటి సమస్యను ఎదుర్కొంటున్న విషయాన్ని ఆరో వార్డు ప్రజలు ముందుగా కౌన్సిలర్ మంజునాథ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన నీటి ట్యాంకర్‌ను తెప్పించారు. నీళ్లు సామాన్య ప్రజలకు అందకుండా మున్సిపల్ ఛైర్మన్ పొరాళు శిల్ప బంధువులు ఆ వార్డులో ఉండడంతో వారికి తొలి ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో ఆ వార్డు మహిళలు ఆందోళనకు దిగారు. ఇంతలోనే మున్సిపల్ కమిషనర్ కిషోర్ అక్కడికి చేరుకున్నారు. మద్యం మత్తులో ఆయన తమపై అసభ్య పదజాలంతో దూషించడంతోపాటు వీరంగం సృష్టించారని మహిళలు ఆరోపించారు.

### మూల్యాంకనం బకాయిలు వెంటనే చెల్లించాలి

**అనంతపురం విద్య, ఏప్రిల్ 7:** మూల్యాంకనం ప్రోత్సాహక బకాయిలను వెంటనే చెల్లించాలని ఫోర్టో నాయకులు.. అధికారులను కోరారు. పదో తరగతి స్పాట్ కేంద్రంలో ఆదివారం డీఈఓ వరలక్ష్మి, ఏసీ గోవింద్‌నాయక్‌ను వారు సన్మానించారు. ఫోర్టో రాష్ట్ర ఛైర్మన్ హరికృష్ణ మాట్లాడుతూ... ఈ ఏడాది మూల్యాకనం డబ్బుతోపాటు, గతేడాది పెండింగ్‌లో ఉంచిన సొమ్మును వెంటనే టీచర్లకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈఓ స్పందిస్తూ... త్వరితగతిని మూల్యాంకనం బకాయిలు చెల్లించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ శ్రీదేవి, ఫోర్టో నాయకులు ఆదిశేషయ్య, లక్ష్మీనారాయణ, ఈరాలప్ప, వేణుగోపాల్, వెంకటరమణ, రాఘవేంద్ర, ఖాజావలి, మహబూబ్ బాషా, రవీంద్ర, పెద్దన్న, నరసింహారెడ్డి, శ్రీనివాసులు, వెంకటేష్ పాల్గొన్నారు.

# అడ్డదారిలో అయ్యవార్లు..!



- వైసీపీకి అనుకూలంగా వ్యవహారాలు
- ఆ పార్టీ అభ్యర్థులకు ఓటేయాలంటూ కొందరు నేతల వ్యూహాలు
- హైవే డాబాలో ఇటీవల గురువులకు విందు... మందు..

**అనంతపురం విద్య, ఏప్రిల్ 7 :** జిల్లాలో కొందరు అయ్యవార్లు అడ్డదారి పట్టారు. వైసీపీని మరోసారి అధికారంలోకి తేవడానికి బరితెగిస్తున్నారు. 10వతేదీ వచ్చినా జీతాలు వేయకున్నా... ఏపీ చరిత్రలోనే ఉపాధ్యాయులకు అందించేతో జీతాల్లో కోత పెట్టినా, హెచ్ఆర్ఏలు తగ్గించినా..., డీఏలు ఇవ్వకున్నా.... ఉపాధ్యాయులను అనేక రకాలుగా వేధించినా....జగన్ సర్కారును మరోసారి అధికారంలోకి తెచ్చేందుకు కొందరు ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు నానా అవస్థలు పడుతున్నారు. వ్యూహాత్మకంగా రాజకీయ విందులు ఏర్పాటు చేస్తున్నారు. మొదట అందరం కలుద్దాం అంటూ ఉపాధ్యాయులను రాజకీయ విందులకు పిలుస్తున్నారు. అందరూ సమావేశమయ్యాక... సమావేశం ముగింపు దశకు చేరుకోగానే...ఉన్నఫలంగా వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలను, ఇతర ప్రజాప్రతినిధులను దించుతారు. వాళ్లు వచ్చి కూర్చోగానే.... మనవాళ్లను గెలిపించండి అంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారు. గత కొంతకాలంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో కొందరు వైసీపీ అనుకూల ఉపాధ్యాయులు, వైఎస్ఆర్‌సీపీ అనుబంధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు చేస్తున్న విందు రాజకీయం ఇదీ.

### మందేసి.. చిందేసి..

ఇటీవల అనంతపురంలోని జాతీయ రహదారిలోని ఓ డాబాలో ఏర్పాటు చిసన విందుకు చాలా మంది ఉపాధ్యాయులకు ఆహ్వానం పంపారు. అయితే అధిక శాతం అధికార వైసీపీ సామాజికవర్గం ఉపాధ్యాయులు, సంఘాల నాయకులే హాజరయ్యారు. వైసీపీ అనుబంధ టీచర్స్ సంఘం నాయకులు, వైసీపీతో అంటకాగే మరో ఉపాధ్యాయ సంఘం నాయకులు ముం దుండి వేడుకను నడిపించారు.. ముక్కలతోపాటు, చుక్కలు కూడా ఉపాధ్యాయులకు సరఫరా చేశారట. బాగా తిన్న తర్వాత కొందరు ఉపాధ్యాయులు మందేసి చిందులు కూడా తొక్కారట. ఒక్కసారిగా తమ సామాజికవర్గం వారిని అందరినీ చూడటంతోపాటు, ఫూటుగా తాగడంతో... కైపు ఎక్కువైన కొందరు ఉపాధ్యాయులు డ్యాన్సులు చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ పార్టీలో వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నాయకుడిగా చెప్పుకునే ఓ పీడీ, కొందరు ప్రధానోపాధ్యాయులు, టీచర్లు కూడా పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఉపాధ్యాయులై ఉండి డాబాల్లో తప్పుతాగి...ఇలా డ్యాన్సులు చేసి ఏం మెసేజ్‌లు ఇద్దామని, వీళ్లు ఇలా చేశారంటూ...పలువురు ఉపాధ్యాయులు వాళ్ల చేష్టలు గురించి చెప్పుకుని పెదవి విరుస్తున్నారు. ఈ ఐదేళ్లల్లో జగన్ సర్కారులో ఉపాధ్యాయులను అనేక ఇబ్బందులకు గురిచేశారని, తీరా ఇప్పుడు మళ్లీ...ఆ పార్టీ నేతలకు ఓట్లు వేయాలంటూ...కొందరు ఉపాధ్యాయులు వంతుపాడుతూ...విందులు చేయడంపై సగటు ఉపాధ్యాయులు మండి పడుతున్నారు. జిల్లావిద్యాశాకాధికారులు ఇప్పుడు డిన్నర్ రాజకీయాలపై విచారణకు దిగారు. దీంతో ఎలాగైనా క్రమశిక్షనా చర్యల నుంచి తప్పించుకోడానికి అ ధికారులపై ఒత్తిళ్లు కూడా తెస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.



### పట్టుచీరల పట్టివేత



తనిఖీల్లో పట్టుబడిన బిల్లులు లేని పట్టుచీరలు

**రొద్దం, ఏప్రిల్ 7:** కర్ణాటక ప్రాంతం నుంచి బిల్లులు లేకుండా తీసుకొస్తున్న పట్టు చీరలను మండలంలోని ఆర్.మరువపల్లి చెక్‌పోస్టులో అధికారులు పట్టుకున్నారు. కర్ణాటక రాష్ట్రం వైఎస్ హొసకోట ప్రాంతానికి చెందిన బాలాజీ అనే వ్యక్తి ఆదివారం మధ్యాహ్నం 96రేషం చీరలు కారులో పావగడ వైపు నుంచి పెనుకొండ వైపుకు తరలిస్తుండగా చెక్‌పోస్టులు అధికారులు తనిఖీ చేశారు. బిల్లులు చూపకపోవడంతో చీరలను స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని పోలీసు స్టేషన్‌కు తరలించారు. చీరలను సీజ్ చేశారు. పట్టు చీరలను పుట్టపర్తి ట్రెజరీ కార్యాలయంలో భద్రపరిచినట్లు రీసర్వే డీటీ చంద్రశేఖర్ తెలిపారు. వాహన తనిఖీల్లో రాము, అనిల్‌కుమార్, పోలీసు సిబ్బంది మారుతి తదితరులు పాల్గొన్నారు.



బిల్లులు లేని పట్టుచీరలతో పోలీసులు, రెవెన్యూ అధికారులు

## ఇంకా ఎన్నాళ్లకో..?

- నేటికీ అందని ఆసరా సొమ్ము
- రెండున్నర నెలల కిందట బటన్ నొక్కిన సీఎం
- అకౌంట్లలో జమకాని నగదు
- పొదుపు మహిళల అసహనం

**అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 7:** దాదాపు రెండున్నర నెలలు దాటినా ఆసరా సొమ్ము అందక అక్క చెల్లెమ్మలు అవస్థలు పడుతున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జనవరి 23న డ్వాక్రా పొదుపు సంఘాల్లోని మహిళలకు ఆసరా సొమ్ము చెల్లిస్తున్నట్లు బటన్ నొక్కారు. నేటికీ ఆ సొమ్ము మహిళల ఖాతాల్లో జమకాలేదు. దీంతో ముఖ్యమంత్రి బటన్ నొక్కడం అంతా ఉత్తదే అని ఆ పొదుపు సంఘాల్లోని మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. డీఆర్‌డీఏ-వైకేపీ అధికారుల ఆన్‌లైన్ వెబ్‌సైట్ రికార్డుల ప్రకారం ఇప్పటి వరకు 5190 స్వయం సహాయక మహిళా సంఘలకు ఆసరా సొమ్ము జమచేయాల్సి ఉంది. అయితే కొన్ని సంఘాలకు సొమ్ము జమ చేయకపోయినా పడినట్లు బలవంతంగా ఒప్పిస్తున్నారు. ఇదేం పద్ధతి అంటూ మహిళలు తిరగపడుతున్నారు. అమౌంట్ పడకనే అకౌంట్లలోకి పడిందని ఎలా చెప్పేదంటూ సిబ్బంది, మహిళలు ప్రశ్నిస్తుండడం అధికారపార్టీ నేతలకు మింగడపడడం లేదు. ఇప్పటికీ 5190 స్వయం సహాయక మహిళా సంఘాలలోని 50వేల మందికి పైగా సభ్యులకు రూ.41.36కోట్లు నిధులు చెల్లించాల్సి ఉంది. జనవరి 23న ఉరవకొండలో సీఎం జగన్ 30వేల సంఘాలలోని 3లక్షల మంది సభ్యులకుగాను రూ.236కోట్లు నిధుల చెల్లింపునకు బటన్ నొక్కారు. అప్పటి నుంచి ఇప్పటిదాకా 70శాతం మందికి మాత్రమే నగదు జమచేశారు. మిగిలిన సభ్యులకు ఎప్పుడు పడుతుందో చెప్పలేని పరిస్థితి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆసరా సొమ్ము ఆలస్యం చేయడంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.




స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు చెక్ అందజేస్తున్న సీఎం జగన్ (ఫైల్)

### అర్హులందరికీ ఆసరా సొమ్ము



ఆసరా సొమ్ముకు సంబంధించి అర్హులైన స్వయం సహాయక సంఘాల మహిళలు ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదు. వైఎస్సార్ ఆసరా పథకం కింద అర్హులందరికీ సొమ్ము చెల్లిస్తాం. పలు సమస్యల కారణంగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమకావడానికి ఆలస్యమవుతోంది. విడతల వారిగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తారు. ఎవరికీ ఎటువంటి సందేహం వద్దు.

- నరసింహారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

## టీడీపీలోనే బీసీల అభివృద్ధి: కృష్ణమూర్తి



మాట్లాడుతున్న కృష్ణమూర్తి

**గాండ్లపెంట, ఏప్రిల్ 7:** తెలుగుదేశం పార్టీతోనే బీసీల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకుడు కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని గొడ్డివెలగల పంచాయతీలో జయహో బీసీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బీసీల అభివృద్ధికి టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీరామారావు బాటలు వేశారన్నారు. బీసీలు మరింత అభివృద్ధిచెందాలంటే టీడీపీని గెలపించాలని కోరారు. ప్రతి బీసీ టీడీపీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు అన్నివర్గాల అభివృద్ధికి సహకరిస్తాయన్నారు. మండల కన్వీనర్ కొండయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి ప్రసాద్, చంద్ర, ఆనంద్, నరసింహులు, మాజీ వైస్ ఎంపీపీ కంబయ్య, పవన్‌కుమార్, దాసిరెడ్డి పాల్గొన్నారు.

## సాయుధ బలగాల కవాతు


సానేవారిపల్లిలో కవాతు చేస్తున్న సాయుధ బలగాలు, పోలీసులు

**నల్లచెరువు, ఏప్రిల్ 7:** మండలంలోని ఓరువాయి, సానేవారిపల్లి, మల్లిరెడ్డిపల్లి, మారిశెట్టి గ్రామాల్లో ఎస్ఐ కేఎం లింగన్న ఆధ్వర్యంలో ఆదివారం సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. అనంతరం నల్లచెరువు జాతీయ రహదారిలో కదిరి, మదనపల్లి వాహనాలను తనిఖీ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు తనిఖీలు చేస్తున్నామన్నారు. ఓటర్లు ప్రలోభాలకు లోనుకాకుండా తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు.

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవంపై ర్యాలీ


ర్యాలీ చేస్తున్న ఆరోగ్యసిబ్బంది

**ముదిగుబ్బ, ఏప్రిల్ 7:** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానికక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ కూడలి వరకు సాగింది. వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి మనిషికి ఆరోగ్యం మహాభాగ్యమన్నారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. జబ్బుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రాథమిక దశలోనే ఏ జబ్బునైనా నివారించవచ్చన్నారు. ఆస్పత్రి సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో అన్నమయ్య జిల్లావాసి మృతి


గణేష్(ఫైల్)

**తనకల్లు, ఏప్రిల్ 7:** మండలంలోని గంగసానిపల్లి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాంలో అన్నమయ్య జిల్లావాసి మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు అన్నమయ్య జిల్లాలోని సీటీఎం(చిన్నప్పతిప్పసముద్రం) గ్రామానికి చెందిన బొలెరో డ్రైవర్ వెంకటసాయి గణేష్(25) రోడ్డు ప్రమాదంలో అక్కడక్కడే మృతి చెందాడు. బళ్లారి నుంచి వాహనంలో సీటీఎంకు వెళ్తుండగా గంగసాని పల్లి సమీపంలో కియ పరిశ్రమకు వెళ్తున్న కంటైనర్ ఢీకొంది. ప్రమాదంలో డ్రైవర్ అక్కడిక్కడే మృతిచెందాడు. వాహనంలో ప్రయాణిస్తున్న మరోవ్యక్తి తీవ్రంగా గాయపడగా, అతనిని అన్నమయ్య జిల్లాలోని ములకలచెరువు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేయనున్నట్లు తనకల్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలియరాలేదు.

**వ్యక్తి గాయాలు:** మండలంలోని కొక్కంటికి చెందిన శ్రీనివాసులు కొక్కంటి క్రాస్‌లో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కొక్కంటి క్రాస్‌లో డివైడర్ దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని 108లో తనకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం కదిరికి తీసుకువెళ్లినట్లు స్థానికులు తెలిపారు.

## నాటుసారా ఊట ధ్వంసం


నాటుసారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

**ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 7:** మండలంలోని నాయనకోట, నవాబుకోట, నాయకోట తండా తదితర గ్రామాల్లో ఆదివారం నల్లమాడ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ ఆధ్వర్యంలో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. నవాబుకోట శిబిరాల్లో 50 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ, ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు. అంతకుముందు గ్రామాల్లో అనుమానిత గృహాల్లో కార్డెన్ సర్చ్ నిర్వహించారు.

**కదిరిఅర్బన్:** మండలంలోని కట్లతండా సమీపంలో ఆదివారం వం దలీటర్ల నాటుసారా ఊట ధ్వంసం చేసినట్లు రూరల్ సీఐ మోహన్ తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు కట్లతండా సమీపంలో సిబ్బందితో దాడులు నిర్వహించగా, నాటుసారా ఊట ధ్వంసం చేశామన్నారు.

### సోలార్ లైటు చోరీ

**తాడిమర్రి, ఏప్రిల్ 7:** మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలకు కూతవేటుదూరంలో ఉన్న వాల్మీకి గోపాల్ తోటలో శనివారం రాత్రి సోలార్ లైటును దొంగలు ఎత్తుకెళ్లారు. వేరుశనగకు రక్షణగా రాత్రిసమయాల్లో ఉంటుందన్న ఉద్దేశ్యంతో సోలార్ లైటును ఏర్పాటు చేసుకోగా దానిని దొంగలు చోరీ చేశారు. దీంతో రైతులు తాడిమర్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ నాగాస్వామి తెలిపారు.

### స్థలవివాదంపై ఘర్షణ

**కదిరిఅర్బన్, ఏప్రిల్ 7:** మండలపరిధిలోని రాచువారిపల్లితండాలో స్థల వివాదంలో రెండు కుటుంబాల మధ్య ఆదివారం ఘర్షణ చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన శంకర్‌నాయక్ ఇంటి స్థలంలో శుభ్రం చేసుకుంటుండగా, అదేగ్రామానికి చెందిన దశరథనాయక్, బాలేనాయక్ స్థలంలో తమకు భాగముందని ఘర్షణకుదిగి శంకర్‌నాయక్, అతని భార్య శాంతమ్మ, కుమారుడు అశోక్‌పై దాడిచేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు దశరథనాయక్, బాలేనాయక్‌లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# ప్రశాంత పుట్టపర్తిని అశాంతిగా మార్చిన దుద్దుకుంట

- టీడీపీ కూటమి అభ్యర్థి పల్లె సింధూర


మాట్లాడుతున్న పల్లె సింధూర, పక్కన మాజీ మంత్రి పల్లె

**పుట్టపర్తి, ఏప్రిల్ 7:** ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిన పుట్టపర్తిని అశాంతిగా మార్చిన ఘనుడు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అని ఉమ్మడి అభ్యర్థి పల్లెసింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఎనుములపల్లిలో ప్రచారాన్ని నిర్వహించారు. ముందుగా కాశీవిశ్వేశ్వరాలయం వెళ్లి శివకేశవులను దర్శించుకున్నారు. వారు మాట్లాడుతూ.. పుట్టపర్తి ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందిందని, అయితే శ్రీధర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత దౌర్జన్యాలు, కబ్జాలు, వసూళ్లు పెరిగిపోయాయన్నారు. దీంతో ప్రశాంతంగా ఉన్న పుట్టపర్తిలో అశాంతి నెలకొందని, ఇటు ప్రజలు, అటు భక్తులు ఎంతో అవేదనకు గురయ్యారన్నారు. ఇలాంటి ఎమ్మెల్యేను మరోసారి గెలిపిస్తే పుట్టపర్తి పరిస్థితి మరింత దిగజారుతుందన్నారు. టీడీపీని గెలిపించడం ద్వారా ముఖ్యమంత్రిగా చంద్రబాబును చేసుకోవాల్సినఅవసరం ఉందన్నారు. పల్లె వెంకటక్రిష్ణ కిశోర్‌రెడ్డి, సామకోటి ఆదినారాయణ, జనసేన పత్తిచంద్రశేఖర్ పాల్గొన్నారు.

**ఓబుళదేవరచెరువు:** మండలంలోని ఇనగలూరు గ్రామంలో సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ నాయకులు ఆదివారం విస్తృత ప్రచారం చేశారు. నాయకులు మాట్లాడుతూ సైకిల్ గుర్తు ఓటు వేసి కూటమి ఎమ్మెల్యేఅభ్యర్థి పల్లె సింధూరాను గెలిపించాలని గెలిపించాలన్నారు. షబ్బరీష్ నాయుడు, రామానాయుడు, చంద్రశేఖర్‌నాయుడు, చంద్రానాయుడు, శివప్రసాద్‌నాయుడు, నరసింహులు, శ్రీనివాసులు, నాగేంద్ర, బాబునాయక్, శ్రీరాములు, గంగాద్రి పాల్గొన్నారు. అలాగే గ్రామాల్లో పల్లె సింధూరా గెలుపునకు వడ్డెర్లు ఆదివారం విస్తృత ప్రచారం చేశారు. పల్లపు రవీంద్ర, జెరిపిటి ఆంజనప్ప, పీట్ల సుధాకర్ మండలంలోని వీర ఓబునపల్లి, బోగానిపల్లి, తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు.

**బుక్కపట్నం:** మండలంలోని క్రిష్ణాపురం గ్రామంలో కూటమి అభ్యర్థి పల్లె సింధూరారెడ్డికి మద్దతుగా ఐటీడీపీ నాయకులు విస్తృత ప్రచారం చేశారు ఆదివారం ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలను,టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టే సంక్షేమపథకాలలను వివరింస్తూ ఓటర్లనుఅభ్యర్థించారు. అప్పస్వామి, రాము, రెడ్డెప్ప, రమణ, రమేష్, మల్లికార్జునచౌదరి, నాగభూషణ పాల్గొన్నారు.

**నల్లమాడ:** మండలంలోని మసకవంకపల్లి, ఎన్ బండవాండ్లపల్లి గ్రామాల్లో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం సూపర్ సిక్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మైలే శివశంకర్, మాజీ కన్వీనర్ కేశవరెడ్డి, బుట్టి నాగభూషణనాయుడు పాల్గొన్నారు.

## కసిగా పనిచేద్దాం: కందికుంట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్

**తనకల్లు, ఏప్రిల్ 7:** రానున్న 40 రోజులు నాయకులు, కార్యకర్తలు కసిగా పనిచేసి టీడీపీ విజయానికి కృషిచేద్దామని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. మండలంలోని చీకటిమానుపల్లి నుంచి తనకల్లు కోటూరు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కట్టకింద గంగమ్మ, తనకల్లులోని చౌడేశ్వరీ ఆలయంలో కందికుంటతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం తనకల్లులోని మండ్లిపల్లి మిట్టవద్ద ఉన్న ఎస్ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో టీడీపీ నాయకుడు ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కందికుంట ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అధోగతిపాలైన ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధిలో నడిపించడానికి అనుభవం కలిగిన చంద్రబాబు నాయకత్వంలోనే సాధ్యమవుతుందన్నారు. వాల్మీకి విద్యాసంస్థ అధినేత పవన్‌కుమార్‌రెడ్డి, జనసేన బ్లూమూన్ విద్యాసంస్థ అధినేత శివశంకర్, సత్యవతి, టీడీపీ రెడ్డిశేఖర్‌రెడ్డి, దేశాయి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

**రెండువందల కుటుంబాలు టీడీపీలో చేరిక:** మండలంలోని చీకటి


తనకల్లులో బైక్ ర్యాలీ చేస్తున్న టీడీపీ నాయకులు

మానుపల్లి గ్రామానికి చెందినవైసీపీ సీనియర్ నాయకుడు నాగిరెడ్డిగారి ఈశ్వర్‌రెడ్డి ఆదివారం అతని అనుచరులు, రెండువందల కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. తనకల్లు సమీపంలో ఎస్ఎంఎస్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. చేరినవారిలో ఈశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ మాధవరెడ్డి, సర్పంచ్ రామాంజులమ్మ, కక్కల క్రిష్టప్ప, రమణప్ప, దినకర్‌నాయుడు ఉన్నారు.

**గాండ్లపెంట:** మండలపరిధిలోని గొడ్డివెలగల పంచాయతీలో ఆదివారం నిర్వహి ంచిన ఎన్నికల ప్రచారంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకప్రటసాద్‌ను గెలిపించాలని నాయకులను ఓటర్లను అభ్యర్థించారు. మండల కన్వీనర్ కొండయ్య ఆధ్వర్యంలో ఇంటింటికెళ్లి సూపర్ సిక్స్‌పథకాలపై అవగాహన కల్పించారు. క్లస్టర్ ఇన్‌చార్జి ప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ కంబయ్య, దాసిరెడ్డి, ఆనంద్, నరసింహులు, పవన్ పాల్గొన్నారు.

**కదిరి:** తలుపుల మండలం టి.రెడ్డివారిపల్లి కాలనీలో కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ఆదివారం విస్తృత ప్రచారం చేశారు. ప్రజలు ఆయనకు నీరాజనాలు పలికి, హారతి ఇచ్చి స్వాగతం పలికారు. ఇంటింటా సూపర్ సిక్స్‌పథకాల గురించి వివరించారు.

## మతసామరస్యానికి ప్రతీక రంజాన్


భోజనం వడ్డిస్తున్న టీడీపీ నాయకుడు రాజశేఖర్ గౌడ్

**బుక్కపట్నం, ఏప్రిల్ 7:** మతసామరస్యానికి ప్రతీక రంజాన్ అని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రాజశేఖర్‌గౌడ్ అన్నారు. ఆదివారం స్థానిక జామియా మసీదులో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రంజాన్ మాసంలో కఠోర ఉపవాసాలు చేస్తూ, భక్తి భావంతో ఉన్న ముస్లింలకు ఇఫ్తారవిందు ఏర్పాటుచేయడం సంతోషంగా ఉందన్నారు.

### రేపు శిల్పారామంలో ఉగాది సంబరాలు

**పుట్టపర్తి, ఏప్రిల్ 7:** ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం శిల్పారామంలో సంబరాలు నిర్వహించనున్నట్లు శిల్పారామం పరిపాలన అధికారి రమేశ్‌రెడ్డి తెలిపారు. పండుగ రోజు మదనపల్లికి చెందిన సూర్యా డ్యాన్స్ అకాడమి సాంస్కృతిక కార్యక్రమాలు, నాగరాజు శర్మతో ఉగాది పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### నేటితో ముగియనున్న పది మూల్యాంకనం

**కొత్తచెరువు, ఏప్రిల్ 7:** పదో తరగతి మూల్యాంకనం సోమవారంతో ముగుస్తుందని జిల్లా విద్యాశాఖఅధికారి మీనాక్షి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం 10399 జవాబు పత్రాలను ఉపాధ్యాయులు మూల్యాంకనం చేసినట్లు ఆమె తెలిపారు. సోమవారం 4,316 జవాబు పత్రాలు మూల్యాంకనంతో ముగుస్తుందని డీఈఓ పేర్కొన్నారు.

### కారు ఢీకొని వలంటీర్ మృతి

**గోరంట్ల, ఏప్రిల్ 7:** పట్టణంలోని హిందూపురం రహదారిలో గ్యాస్ కార్యాలయం వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో వలంటీర్ మేదర శంకర్(34) శనివారం రాత్రి మృతిచెందినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. మల్లాపల్లి లేఅవుట్లో నివాసముంటున్న వెంకటరాముడు కుమారుడు మేదర శంకర్ గోరంట్ల-1 సచివాలయంలో వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి 9.30గంటల సమయంలో గోరంట్ల నుంచి ఇంటికి వెళ్తుంగా అమోగా రెస్టారెంట్ వద్ద ఎదురుగా వస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదం అనంతరం కారు ఆగకుండా వేగంగా వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన వలంటీరును గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా, చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రయివేటు అంబులెన్స్‌లో హిందూపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## బాస్కెట్‌బాల్ పోటీలకు ధర్మవరం క్రీడాకారుడు


విజయ్

**ధర్మవరం, ఏప్రిల్ 7:** జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ధర్మవరానికి చెందిన క్రీడాకారుడు విజయ్ ఎంపికైనట్లు ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. విద్యార్థి పుదుచ్చెరి రాష్ట్రంలో గాంధీ ఇండోర్‌స్టేడియంలో ఈనెల 9 నుంచి 15వ తేదీ వరకు జరిగే 38వ యూత్ నేషనల్ బాస్కెట్‌బాల్ పోటీలలో పాల్గొంటారన్నారు. క్రీడాకారుడిని సంఘం అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్ అభినందించారు.

## ఆలయాల అభివృద్ధికి సహకరిస్తా

శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానందస్వామి


ఆలయ ప్రారంభోత్సవానికి స్వామీజీని ఆహ్వానిస్తున్న అయ్యప్పభక్తులు

**హిందూపురం అర్బన్, ఏప్రిల్ 7:** ఆలయాల అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని కాకినాడ శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానందస్వామి పేర్కొన్నారు. హిందూపురం శ్రీకంఠపురం ప్రాంతంలో నిర్మించిన అయప్ప ఆలయం ప్రారంభోత్సవానికి అయ్యప్ప భక్తులు స్వామీజీని ఆదివారం ఆహ్వా నించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ. శ్రీకంఠేశ్వర అయ్యప్ప ఆల యంగా నామకరణం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆలయ ప్రారంభోత్సవానికి తప్పక వస్తానని తెలిపారు. ఆయన్ను ఆహ్వానించిన వారిలో గురుస్వాములు లింగప్ప, నాగరాజు తదితరులు ఉన్నారు.

### బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**మడకశిరటౌన్, ఏప్రిల్ 7:** మండల పరిధిలోని కల్లుమర్రిగ్రామానికి చెందిన పలువురు శనివారం రాత్రి ఆటోలో వెళుతున్న సమయంలో ఐషర్ వాహనం ఢీకొనగా ఆరుగురు గాయపడ్డారు. విషయం తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న, మాజీ ఎంపీపీ ఆదినారాయణ, మాజీ మండల కన్వీనర్ రామాంజనేయులు తదితరులు ఆదివారం మడకశిర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. అధైర్య పడవద్దని వైద్యానికి అవసరమైన సహకారం అందిస్తామని వారికి ధైర్యం చెప్పారు.

# గ్రామీణ రహదారులు అధ్వానం

- కంకరతేలిన దారులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

**ధర్మవరంరూరల్, ఏప్రిల్ 7:** గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. ఆ గ్రామాలకు వెళ్లాలంటే నరకప్రాయంగా ఉందని గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రాంపురం నుంచి ధర్మవరంకు వెళ్లేందుకు ప్రధాన రహదారి కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. ఈ గ్రామం నుంచి ధర్మవరంకు ద్విచక్రవాహనాలు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దారిలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అంటున్నారు. అలాగే ముచ్చురామి గ్రామానికి వెళ్లాలన్నా మట్టిరోడ్డంతా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. రహదారులు అధ్వానంగా ఉండటంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారులను బాగుచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


కంకర తేలిన రాంపురం-ధర్మవరం రహదారి


అధ్వానంగా ఉన్న ధర్మవరం-ముచ్చురామి రోడ్డు

## అవినీతిపరులను జైలుకు పంపుతాం

- ఉమ్మడి అభ్యర్థి సత్యకుమార్ యాదవ్


మాట్లాడుతున్న సత్యకుమార్, చిత్రంలో పరిటాల శ్రీరామ్ తదితరులు

**తాడిమర్రి, ఏప్రిల్ 7:** అవినీతికి పాల్పడిన వారందరిని తప్పకుండా జైలుకు పంపుతామని ధర్మవరం కూటమి అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికిముఖ్య అతిథులుగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్, బీజేపీ నాయకులు శ్రీనివాసులు, లలిత్‌కుమార్, ప్రకాశ్‌నాయుడు హాజరయ్యారు. సత్యకుమార్ మాట్లాడుతూ ఒకవైపు తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి జగన్ మాత్రం భారతి సిమెంట్ కంపెనీకి, భావమరిది కంపెనీలకు ప్రత్యేకంగా నీటిని తీసుకెళుతున్నాడన్నారు. నేను ఆంధ్రప్రదేశ్‌కు కొత్తవాడిని కాదని, ధర్మవరం నియోజకవర్గంలో నాకు తెలిసిన వారున్నారన్నారు. మీ అందరి సహకారంతో ఎమ్మెల్యేగా గెలిచినియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు వచ్చానన్నారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ తనకు ఎలాంటి సహకారం అందించారో అంతకు రెట్టింపు సహకారాన్ని సత్యకుమార్‌కు అందించి నియోజకవర్గానికి ఒక బీసీని ఎమ్మెల్యేగా గెలిపించుకుందామన్నారు. టీడీపీ నాయకులు కూచి రామ్మోహన్, జనార్దన్‌నాయుడు, విజయ్‌కుమార్, హర్షవర్ధన్, రాజశేఖర్, సాయి, విశ్వనాథ్, ఆత్మకూరు శ్రీనివాసులు, కునుకుంట్ల యల్లప్ప, బద్రి, బీజేపీ గంగులకుంట గోపాల్‌రెడ్డి, పోతలయ్య పాల్గొన్నారు.

**శ్రీరామ్‌కున్న మెచ్యూరిటీ.. ఆ వయసులో నాకు కూడాలేదు**

**బత్తలపల్లి:** పరిటాల శ్రీరామ్‌కు ఉన్న పరిజ్ఞానం తనకు కూడా లేదని ఉమ్మడి అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ, బీజేపీ నాయకులతో సత్యకుమార్‌యాదవ్, పరిటాలశ్రీరామ్ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిటాల శ్రీరామ్ మాట్లాడుతున్న మాటలు ఆయన ఆలోచించే తీరు చూస్తుంటే ఇంత మెచ్యూరిటీ, అంతపరిజ్ఞానం నాకు కూడా ఆ వయసులోలేదన్నారు. పరిటాలశ్రీరామ్ మాట్లాడుతూ తొలిసారి ధర్మవరంలో బీసీ అభ్యర్థికి అవకాశం వచ్చిందన్నారు. ఆయనను గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. టీడీపీ నాయకులు గోనుగుంట్ల విజయ్‌కుమార్, జక్కంపూటి నాగభూషణం, లక్ష్మీనారాయణ, చల్లా శ్రీనివాసులు, ఉమాపతినాయుడు, చితంబరరెడ్డి, మందల శ్రీనివాసులు, నారాయణస్వామి, రవి, తాళ్లూరు సతీశ్ పాల్గొన్నారు.

## వైసీపీ కౌన్సిలర్లకు వ్యాపారం కుదిరిందా?

- ప్రశ్నించిన టీడీపీలో చేరిన కౌన్సిలర్లు


మాట్లాడుతున్న కౌన్సిలర్లు, నాయకులు

**కదిరి, ఏప్రిల్ 7:** మాకు వ్యాపారం కుదరక టీడీపీలో చేరామని చెబుతున్న వైసీపీ కౌన్సిలర్లకు వ్యాపారం కుదిరిందా అని ఇటీవల టీడీపీలో చేరిన కౌన్సిలర్లు ప్రశ్నించారు. ఆదివారం కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మాకు వ్యాపారం కుదరక పార్టీ మారామని వైసీపీ కౌన్సిలర్లు చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. అయితే మీకు ఎంత కుదిరిందని వారిని ప్రశ్నించారు. వైసీపీ కౌన్సిలర్లు తమ గురించి నీచంగా మాట్లాడారని అన్నారు. ఒక కౌన్సిలర్ గురించి మున్సిపాలిటీలో ఏవిభాగానికి పోయినా అతని అవినీతి దందా ఉద్యోగులే చెబుతారన్నారు. వైస్ చైర్మన్ పదవికోసం ఎవరి కాళ్ల పట్టుకున్నది మరిచిపోయారా అని ప్రశ్నించారు. తామే వ్యాపారాలు చేయాలనుకుంటే ఎప్పుడో చేసేవారమని, నిజాయితీగా ఉన్నాం కాబట్టే ఉత్తమమైన అభ్యర్థి గెలుపుకోసం టీడీపీలో చేరామన్నారు. సమావేశంలో టీడీపీ కౌన్సిలర్లు ఎంఎన్ ఫయాజ్, నాయకులు కెఎస్. బాహద్దీన్, డైమండ్ ఇర్ఫాన్, రాజశేఖర్‌బాబు, క్రిష్టప్ప, విశ్వనాథ్, మధు, అహమ్మద్ పాల్గొన్నారు.

## ట్యాంకర్లతో నీటి సరఫరా


పాతులవాండ్లపల్లిలో ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

**గాండ్లపెంట, ఏప్రిల్ 7:** మండలంలోని పోతులవాండ్లపల్లిలో ట్యాంకర్ల ద్వారా పంచాయతీ అధికారులు ఆదివారం నీటిని సరఫరా చేశారు. గొంతెండుతున్న గ్రామాలు అన్న కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ గ్రామానికి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అడుగంటిన బోర్లను మరింత లోతుగా తవ్వించి, తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

### ఎంసెట్‌కు ఉచిత శిక్షణ

**పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 7:** ఎంసెట్ పోటీ పరీక్షకు సంబంధించి ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మంగళకర కరస్పాండెంట్ సురేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు, గోరంట్ల, పెడపల్లి, బ్రాహ్మణపల్లి, జానకంపల్లి, బుచ్చయ్యగారిపల్లి, బీడుపల్లిలకు చెందిన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పూర్తీ చేసుకున్న విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యంతో పాటు శిక్షణను 6వ తేదీ నుంచి ప్రారంభించామన్నారు. ఉదయం 9-30 నుంచి సాయంత్రం 4-30 గంటల వరకు క్లాసులు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### విద్యుత్ స్తంభానికి ఎగబాకిన తీగ

**మడకశిర రూరల్, ఏప్రిల్ 7:** మండలంలోని కల్లుమ ర్రి గ్రామానికి విద్యుత్ సరఫరా అయ్యే ప్రధాన లైన్ స్తంభానికి చెట్టు తీగలు చుట్టు కున్నాయి. గ్రామ సమీపంలో ఉన్న స్తంభం పై వరకు ఎగబాకాయి. దీంతో విద్యుత్ స్తంభానికి అమర్చిన ట్రాన్స్ ఫార్మర్ కూడా కనపడడంలేదు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్తంభానికి చుట్టేసిన చెట్టు తీగలను తొలగించా లని కోరుతున్నారు.


విద్యుత్ స్తంభాన్ని కప్పేసిన తీగలు

## ఘనంగా ఆరోగ్య దినోత్సవం

**గోరంట్ల, ఏప్రిల్ 7:** పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆరోగ్యదినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రెడ్‌క్రాస్ సొసైటీ కోఆర్డినేటర్ రమేష్, సభ్యులు దేవాంగం జగదీశ్వర్ అనారోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆరోగ్య పరిపరక్షణ, ఆరోగ్య సూత్రాలు, అందుబాటులో ఉన్న వైద్య సేవలుగురించి వివరించారు. బుద్ధిమాంద్యం, అంగవైకల్యం ఉన్నవారు, వితంతవులు, వయోవృద్ధులు, ఒంటరి మహిళలు 50మందికి హైజినిక్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు చంద్ర మోహన్, టైలర్ వెంకటేష్, విజయకుమార్, వైద్యసిబ్బంది తులసి, పీరూబాయి తదితరులున్నారు.

## అంగన్‌వాడీ సెక్టార్ కమిటీ ఎంపిక

**రొద్దం, ఏప్రిల్ 7 :** మండలంలోని ఆర్ మరువపల్లి అంగనవాడీ సెక్టార్ నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షురాలిగా సునీత, కార్యదర్శిగా కొత్తకోట శ్యామలగౌరి ఎంపికయ్యారు. మండలంలోని ఆర్ మరువపల్లిలో ఆదివారం అంగన్‌వాడీల సెక్టార్ కమిటీ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ పాల్గొని కమిటీని ఎంపిక చేశారు. సెక్టార్ పరిధిలో ఉన్న అంగనవాడీ హెల్పర్ల సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు జయమ్మ, కార్యదర్శి బావమ్మ పాల్గొన్నారు.

## బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న తదితరులు

**మడకశిరటౌన్, ఏప్రిల్ 7:** మండల పరిధిలోని వద్రపాళ్యం వద్ద శనివారం రాత్రి ఆటోను ఐషర్ వాహనం ఢీకొని ఆరుగురు గాయపడ్డారు. వారంతా కల్లుమర్రి గ్రామానికి చెందిన వారే. వారిని స్థానికులు మడకశిర ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న, మాజీ ఎంపీపీ ఆదినారాయణ, మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు తదితరులు ఆదివారం మడకశిర ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. అధైర్య పడవద్దని వైద్యానికి అవసరమైన సహకారం అందిస్తామని వారికి ధైర్యం చెప్పారు. డాక్టర్ అనీల్‌తో వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట టీడీపీ నాయకులు కిష్టప్ప తదితరులు ఉన్నారు.

## కారు ఢీకొని వలంటీర్ మృతి



మేదర శంకర్ (ఫైల్)

**గోరంట్ల, ఏప్రిల్ 7:** పట్టణంలోని హిందూపురం రహదారిలో గ్యాస్ కార్యాలయం వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో వలంటీర్ మేదర శంకర్ (34 ) శనివారం రాత్రి మృతిచెందినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. స్థానిక మల్లాపల్లి లేఅవుట్లో నివాసముంటున్న వెంకటరాముడు కుమారుడు మేదర శంకర్ గోరంట్ల -1 సచివాలయంలో వలంటీర్‌గా పనిచేస్తున్నారు. ఆయన శనివారం రాత్రి 9.30గంటల సమయంలో గోరంట్ల నుంచి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో ఓ రెస్టారెంట్ వద్ద ఎదురుగా వస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదం అనంతరం కారు ఆగకుండా వేగంగా వెళ్లిపోయింద. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వలంటీర్‌ను కుటుంబసభ్యులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సల అనంతరం, మెరుగైన వైద్యం కోసం ఓ ప్రయివేటు అంబులెన్స్‌లో హిందూపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు సీఐ తెలిపారు. శవానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## ద్విచక్రవాహనం బోల్తా

- వ్యక్తికి గాయాలు

**అగళి, ఏప్రిల్ 7 :** మండలంలోని రమణపల్లి కి చెందిన బాలకృష్ణ ఆదివారం మడకశిరలో జరిగే వైసీపీ బైక్‌ర్యాలీకి వెళ్తున్నాడు. అయితే మడకశిర మండలంలోని గంగులవాయిపాళెం వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో బాలకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్య చికిత్స కోసం హిందూపురం తరలించారు.

## మహిళ ఆత్మహత్యాయత్నం

**గోరంట్ల, ఏప్రిల్ 7:** మండలంలోని దిగువగంగంపల్లి తండాకు చెందిన శిరిబాయి అనే మహిళ కుటుంబ కలహాలతో ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దిగువ గంగంపల్లి తండాకు చెందిన శ్రీకాంత్‌నాయక్, శిరిబాయి దంపతులు ఆదివారం గొడవపడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసింది. గమనించిన బంధువులు వెంటనే ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్ ఉష వైద్యచికిత్సలు అందించారు. ఆత్మహత్యాయత్నానికి గురైన ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించినట్లు బంధువులు తెలిపారు.

## దళితుల మద్దతు కాంగ్రెస్‌కే..

జేడీఎస్ నాయకుడు హనుమంతరాయప్ప

**పావగడ, ఏప్రిల్ 7:** రాష్ట్రంలో ఈనెల 26న జరిగే పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి దళితుల ఓట్లన్నీ కాంగ్రెస్‌కే చేరుతాయని జేడీఎస్ సీనియర్ నాయకుడు ఎస్.హనుమంతరాయప్ప పేర్కొన్నారు. ఆయన ఆదివారం దళిత నాయకుడు ఓబుళపతితో కలిసి పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. గత 20 సంవత్సరాల నుంచి సొంత కులం వాడని తిమ్మరాయప్పను నమ్మి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించామన్నారు. అయినా ఆయన తమ సమాజానికి చేసిందేమీ లేదన్నారు. చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకొనే రీతిలో ఆయన వ్యవహార ధోరణి ఉందని, ఇది తమ రాజకీయ జీవితాన్ని కుదిపివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమాజానికి చెడు కోరేవారెవరూ బాగుపడరని, తిమ్మరాయప్ప ఒక అవకాశ వాది అన్నారు. హనుమంతరాయప్ప 2019లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో చంద్రప్ప పరంగా ఓట్లు అడిగారన్నారు. ప్రస్తుతం బీజేపీ అభ్యర్థి గోవిందకార్జోళతో కలిసి ఆయన రాజకీయ సన్యాసం చేయడం అవకాశ వాది అనడానికి నిదర్శనం అన్నారు. దళితులు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించు కొంటే భవిషత్తులో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు.

# వైసీపీకి చరమగీతం పాడుదాం

- ◆ కియతో జిల్లాకు ప్రపంచ గుర్తింపు
- ◆ అభివృద్ధికి చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్
- ◆ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నందమూరి బాలకృష్ణ



బాలకృష్ణను సన్మానిస్తున్న టీడీపీలోకి చేరినవారు

**హిందూపురం, ఏప్రిల్ 7:** వచ్చే ఎన్నికల్లో వైసీపీకి చరమగీతం పాడుదామని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. ఆయన ఆదివారం హిందూపురంలో రోజంతా బిజీ షెడ్యూల్‌తో గడిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఉదయం జనసేన, బీజేపీ, టీడీపీ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన పలువురిని పార్టీలోకి కండువాలు వేసి ఆహ్వానించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల ప్రచార వ్యూహంపై చర్చించారు. జేవీఎస్ ఫంక్షన్‌హాల్‌లో మూడు పార్టీల నాయకుల సమావేశంలో పాల్గొన్నారు. ఆర్‌ఎంఎస్ ఫంక్షన్‌హాల్‌లో దళితుల బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జేవీఎస్ ఫంక్షన్‌హాల్‌లో మాట్లాడుతూ ... విభజన తరువాత రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం దిశగా పరుగులు పెట్టించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కిందన్నారు. అయితే ఈ ఐదేళ్లలో రాష్ట్ర భవిష్యత్తు 30ఏళ్ల వెనక్కు వెళ్లిందన్నారు. ఈ ఐదేళ్లలో ఎక్కడైనా ఒక్క పరిశ్రమ రాష్ట్రానికి వచ్చిందా అన్నారు. ప్రపంచంలోనే మేటి పరిశ్రమ అయిన కియ రావడంతో ఉమ్మడి అనంతపురం జిల్లాకు ప్రపంచగుర్తింపు వచ్చిందన్నారు. కూటమి అధికారంలోకి వస్తే జిల్లాకు మరిన్ని పరిశ్రమలు తెచ్చి నిరుద్యోగ సమస్య తీరుస్తామన్నారు. అభివృద్ధికి చంద్రబాబును బ్రాండ్ అంబాసిడర్‌గా వర్ణించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి చంద్రబాబే మూల కారణమన్నారు. టీడీపీ ప్రతిపాదనతోనే గతంలో ఎన్డీఏ ప్రభుత్వం ప్రతి పల్లెకు తారు రోడ్లు వేసేందుకు సహరించిందన్నారు. కానీ ప్రస్తుతం రాష్ట్ర భవిష్యత్తు, రాష్ట్రంలోని దారులు గతుకులమయం అని విమర్శించారు. ఒకప్పుడు హిందూపురంలో బిందె నీటి కోసం యుద్ధాలు చేసేవారని, నేడు ప్రతి ఇంటికీ నీరు వస్తోందంటే ఆ ఘనత బీజేపీ, టీడీపీకే దక్కుతుందన్నారు. మూడో సారి పోటీచేస్తున్నానని అందరూ ఆశీర్వదించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి మాట్లాడుతూ తాను ఎంపీగా ఉన్న సమయంలో వందలాది బస్ షెల్టర్లు, విద్యాసంస్థలు, పురానికి దీర్ఘకాలిక సమస్యగా ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేశామన్నారు. మరో సారి అవకాశం ఇవ్వాలన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు వరుణ్ మాట్లాడు తూ మూడు పార్టీల కలయిక రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసమే అన్నారు. కార్యక్ర మంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు రమేష్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ఉమేష్, బీజేపీ ఆదర్శ, వరప్రసాద్, చక్రి, చిన్నా ప్రవీణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**పెద్దఎత్తున టీడీపీలోకి చేరిక:** రాష్ట్ర భవిష్యత్తు తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని భావించి వైసీపీ నుంచి టీడీపీలోకి చేరినట్లు నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద ఆదివారం వైసీపీ నుంచి టీడీపీలోకి పెద్దఎత్తున చేరారు. చిలమత్తూరు మండలం కోడూరు పంచాయతీ మాజీ సర్పంచ్ సోమశేఖర్‌తోపాటు పలువురికి బాలకృష్ణ పార్టీ కండువావేసి ఆహ్వానించారు. లేపాక్షి మండలం, హిందూపురం పట్టణం, రూరల్ మండలానికి చెందిన పలువురు టీడీపీలో చేరారు. అలాగే త్రైత సిద్ధాంత కర్తలు ఎమ్మెల్యే బాలకృష్ణ చేతులమీదుగా తెలుగు క్యాలెండర్‌ను అవిష్కరించారు.

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్



ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థి సునీల్‌కుమార్

**గుడిబండ, ఏప్రిల్ 7 :** మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఈరన్న పేర్కొన్నారు. మండలంలోని మందలపల్లి, సిసిగిరి పంచాయతీ గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తెలుగుదేశం పార్టీని ఆదరించాలన్నారు సైకిల్ గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో సునీల్‌కుమార్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. హంద్రీనీవా నీటితో అన్ని చెరువులను నింపి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. రైతుల అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతామని అన్నారు. వైసీపీకి ఓటుతో బుద్ధిచెప్పాలన్నారు. టీడీపీ హయాంలోనే ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించామని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎస్‌హెచ్ రాయుడు, నాయకులు, సుధాకర్, మారేగౌడ్, రమేష్, జయరాంరెడ్డి, కాంతరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఇఫ్తార్ విందు

**రొళ్ల :** మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన రంజాన్ ఇఫ్తార్ విందులో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని మసీదు వద్ద ముస్లింలు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా డాక్టర్ సునీల్‌కుమార్, టీడీపీనాయకులు సతీష్‌కుమార్, అరుణ్, కిరణ్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

**మడకశిరటౌన్, ఏప్రిల్ 7:** పట్టణంలోని మాతాఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 2015-16 పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కలిశారు. గత స్మృతులను నెమరువేసుకొన్నారు. విద్యార్థులు ఒకరికొకరు తమ జ్ఞాపకాలను పంచుకొన్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జోసఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో అన్నమయ్య జిల్లావాసి మృతి



గణేష్(ఫైల్)

**తనకల్లు, ఏప్రిల్ 7:** మండలంలోని గంగసానిపల్లి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాంలో అన్నమయ్య జిల్లావాసి మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు అన్నమయ్య జిల్లాలోని సీటీఎం(చిన్నప్పతిప్పసముద్రం) గ్రామానికి చెం దిన బొలెరో డ్రైవర్ వెంకటసాయి గణేష్(25) రోడ్డు ప్రమాదంలో అక్కడక్కడే మృతి చెందా డు. బళ్లారి నుంచి వాహనంలో సీటీఎంకు వెళ్తుండగా గంగసాని పల్లి సమీపంలో కియ పరిశ్రమకు వెళ్తున్న కంటైనర్ ఢీకొంది. ప్రమాదంలో డ్రైవర్ అక్కడిక్కడే మృతి చెందాడు. వాహనంలో ప్రయాణిస్తున్న మరోవ్యక్తి తీవ్రంగా గాయపడగా, అతనిని అన్నమయ్య జిల్లాలోని ములకలచెరువు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేయనున్నట్లు తనకల్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలియరాలేదు.

**వ్యక్తి గాయాలు:** మండలంలోని కొక్కంటికి చెందిన శ్రీనివాసులు కొక్కంటి క్రాస్‌లో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కొక్కంటి క్రాస్‌లో డివైడర్ దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని 108లో తనకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం కదిరికి తీసుకువెళ్లినట్లు స్థానికులు తెలిపారు.

## దళితులకు సంక్షేమ పథకాలు ఇచ్చింది టీడీపీనే



డప్పు వాయిస్తున్న బాలకృష్ణ

**హిందూపురం, ఏప్రిల్ 7:** నాఎస్సీ అనిమాయమాటలు చెప్పి దళితులను జగన్ మోసం చేశాడని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ విమర్శించారు. పట్టణంలోని ఆర్ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం దళితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ సీఎం జగన్ దళితుల ద్రోహి అని, ఎస్సీలకు సంబంధించి పలు పథకాలు రద్దు చేశారన్నారు. కానీ మభ్య పెట్టడానికి మాయమాటలు చెబుతున్నారన్నారు. ఈ సందర్భంగా దళితుల ఆధ్వర్యంలో మీ ఓటుతో ముడిపడి ఉంది అనే సీడీని బీకే పార్థసారథితో కలిసి ఆవిష్కరించారు. కొద్ది సేపు దళిత మహిళలతో కలిసి నృత్యం చేసి, డప్పు మోగించారు.

### మైనార్టీలకు రక్షణ కల్పిస్తాం

ఎన్‌డీఏ ప్రభుత్వం మైనార్టీలకు రక్షణ కల్పిస్తుందని ఇందులో సందేహం పడాల్సిన అవసరం లేదని బాలకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని అల్ హిలాల్ మైదానంలో ఆదివారం రాత్రి టీడీపీ ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీలకు రంజాన్ మాసం పురస్కరించుకొని ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లింలతో కలిసి ఆయన ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం ముస్లింల హక్కులకు భంగం కలిగించదని అపోహలు నమ్మవద్దన్నారు. వైసీపీపాలనలో మైనార్టీలు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు.పురంలో మసీదుల అభివృద్ధికి తానిచ్చిన నిధులు తప్ప, వైసీపీ ఏం చేసిందని ప్రశ్నించారు.

## పలు గ్రామాల్లో కాంగ్రెస్ ప్రచారం

**అగళి, ఏప్రిల్ 7:** మండలం పీబ్యాడిగెర, హెచ్‌డీహళ్లి గ్రామ పంచాయతీలోని గ్రామాల్లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడబ్ల్యూసీ సభ్యుడు నీలకంఠాపురం రఘువీరారెడ్డి పాల్గొని కాంగ్రెస్ పార్టీ మడకశిర అభ్యర్థి సుధాకర్ తరపున ప్రచారం సాగించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, మండల కన్వీనర్ లోకేష్, బీ బ్లాక్ అధ్యక్షుడు త్యాగరాజు, నాయకులు నరసప్ప, గోవిందప్ప, మారుతి, చిక్కనప్ప, నరసింహయ్య, వెన్నెసప్ప తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ రహదారులు అధ్వానం

- ● కంకరతేలిన దారులు
- ● ఇబ్బంది పడుతున్న ప్రజలు, వాహనదారులు
- ● పట్టించుకోని పంచాయతీ అధికారులు

**ధర్మవరంరూరల్, ఏప్రిల్ 7:** గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. ఆ గ్రామాలకు వెళ్లాలంటే నరకప్రాయంగా ఉందని గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రాంపురం నుంచి ధర్మవరంకు వెళ్లేందుకు ప్రధాన రహదారి కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. ఈ గ్రామం నుంచి ధర్మవరంకు ద్విచక్రవాహనాలు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దారిలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అంటున్నారు. అలాగే ముచ్చురామి గ్రామానికి వెళ్లాలన్నా మట్టిరోడ్డంతా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. రహదారులు అధ్వానంగా ఉండటంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారులను బాగుచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కంకర తేలిన రాంపురం-ధర్మవరం రహదారి

# కిటకిటలాడిన వారపుసంత

స్తంభించిన ట్రాఫిక్

**పెనుకొండ, ఏప్రిల్ 7:** తెలుగు సంవత్సరాది ఉగాది పండగను పురస్కరించుకుని ఆదివారం పెనుకొండలో జరిగిన వారపుసంత కొనుగోలు దారులతో కిటకిటలాడింది. పండగకు అవసరమైన కొత్తబట్టలు, నిత్యవసర వస్తువులు, ఇతర సామగ్రి కొనుగోలుకు పెనుకొండతోపాటు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. దీనికారణంగా పట్టణంలోని దుకాణాలన్నీ కొనుగోలుదారులతో కిటకిటలా డాయి. ఊరువాకిలి అంజనేయస్వామి ఆల యం నుంచి తెలుగుతల్లి సర్కిల్, దర్గాసర్కిల్ లోని దుకాణాలతో పాటు వారపుసంత కారణంగా వీధులన్నా కొనుగోలుదారులతో కిటకిటాలాడాయి. ఈ రద్దీతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అటుగా వచ్చిన అంబులెన్స్ వాహనం ట్రాఫిక్‌లో చిక్కుకుని వెళ్లడానికి వీలులేక రోగులు ఇబ్బం దులకు గురయ్యారు. ట్రాఫిక్‌ను నియంత్రించడానికి కనీసం ఒక్క హోమ్‌గార్డ్ కూడా లేకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.



జనంతో కిటకిటలాడుతున్న వారపుసంత

## టీడీపీతోనే యువతకు ఉద్యోగాలు

పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత



వడ్డిపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి సవిత

**హిందూపురం అర్బన్, ఏప్రిల్ 7:** రాష్ట్రంలో యువత బాగుండాలంటే వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, అది టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. మండలకేంద్రమైన పరిగి ఆదివారం మండలం యువత ఏర్పాటు చేసిన సవితతో భవిత అనే కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఏ దేశ భవిష్యత్తు అయినా యువత చేతుల్లోనే ఉంటుందన్నారు. అలాంటి యువతకు ఉపాధి కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. యువతకు ఉద్యోగాలు, రావాలన్నా, మన ప్రాంతానికి పరిశ్రమలు వచ్చి, ప్రజలకు ఉపాధి దొరకాలంటే టీడీపీని గెలిపించాలన్నారు. టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ నరసింహరావు, నాయకులు ధనాపురం సూరి, హనుమయ్య, వందలాది మంది యువత, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

**గోరంట్ల:** ఐదేళ్ల వైసీపీ పాలన పంచాయతీ సర్పంచ్ వ్యవస్థను వైసీపీ పాలన సర్వనాశం చేసినందని టీడీపీ కూటమి అభ్యర్థి సవిత విమర్శించారు. ఆమె ఆదివారం మండలంలోని రెడ్డిచెరువుపల్లి పంచాయతీలోని వడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. మాజీ సర్పంచ్ నిడి మామిడప్ప 23 వడ్డెర కుటుంబాలతో కలిసి వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. రెడ్డిచెరువుపల్లి పంచాయతీలో వలంటీర్లు బెదిరిస్తున్నారని తెలిసిందన్నారు. వచ్చేది టీడీపీ ప్రభుత్వమే అని జాగ్రత్తగా వహించాలని సవిత కోరారు. టీడీపీ మండల కన్వీనర్ సోముశేఖర్, కొత్తపల్లి నరసింహప్ప, అశ్వత్థరెడ్డి, నీలకంఠా రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నిమ్మల చంద్రశేఖర్, నిమ్మల శ్రీదర్, రామచంద్ర, విజయ శేఖర్, కోగిర విజయశేఖర్, కోగిర శ్రీనివాసులు, జంపాల కమలాకర్, అచ్యుత్, హరిచౌదరి, అశోక్, ఉత్తమరెడ్డి, మనోహర్, వేణు, జనసేన సంతోష్, వెంకటేష్ తదితరులున్నారు.

## వైసీపీ అసత్య ప్రచారాలను తిప్పి కొట్టండి : సవిత

**పెనుకొండ టౌన్, ఏప్రిల్ 7 :** అధికార పార్టీ వైసీపీ సోషల్ మీడియాలో చేస్తున్న అసత్యప్రచారాలను టీడీపీ సోషల్ మీడియా తిప్పికొట్టాలని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. ఆమె ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ పరిశీలకుడు నరసింహారావుతో కలిసి టీడీపీ సోషల్ మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ... టీడీపీ గెలుపే లక్ష్యంగా, నారా చంద్రబాబు నాయుడిని ముఖ్య మంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడాలన్నారు. వైసీపీ పెనుకొండ సోషల్ మీడియాలో అబద్ధాల ప్రచారమే పనిగా పెట్టుకుని పోస్టులు పెడుతున్నారన్నారు. వాటిని ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలని, ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపాలన్నారు. అలాగే టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర సాధికార కన్వీనర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి సహకరిస్తా

శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానందస్వామి



ఆలయ ప్రారంభోత్సవానికి స్వామీజీని ఆహ్వానిస్తున్న అయ్యప్పభక్తులు

**హిందూపురం అర్బన్, ఏప్రిల్ 7:** ఆలయాల అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని కాకినాడ శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానందస్వామి పేర్కొన్నారు. హిందూపురం శ్రీకంఠపురం ప్రాంతంలో నిర్వహించిన అయప్ప ఆలయం ప్రారంభోత్సవానికి అయ్యప్ప భక్తులు స్వామీజీని ఆదివారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ. శ్రీకంఠేశ్వర అయ్యప్ప ఆలయంగా నామకరణం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆలయ ప్రారంభోత్సవానికి తప్పక వస్తానని తెలిపారు. ఆయన్ను ఆహ్వానించిన వారిలో గురుస్వాములు లింగప్ప, నాగరాజు తదితరులు ఉన్నారు.

## విద్యుత్ స్తంభానికి ఎగబాకిన తీగ



విద్యుత్ స్తంభాన్ని కప్పేసిన తీగలు

**మడకశిర రూరల్, ఏప్రిల్ 7:** మండలంలోని కల్లుమ ర్రి గ్రామానికి విద్యుత్ సరఫరా అయ్యే ప్రధాన లైన్ స్తంభానికి చెట్టు తీగలు చుట్టు కున్నాయి. గ్రామ సమీపంలో ఉన్న స్తంభం పై వరకు ఎగబాకాయి. దీంతో విద్యుత్ స్తంభానికి అమర్చిన ట్రాన్స్ ఫార్మర్ కూడా కనపడడంలేదు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్తంభానికి చుట్టేసిన చెట్టు తీగలను తొలగించా లని కోరుతున్నారు.

## నాటుసారా ఊట ధ్వంసం

**ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 7:** మండలంలోని నాయనకోట, నవాబుకోట, నాయకోట తండా తదితర గ్రామాల్లో ఆదివారం నల్లమాడ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ ఆధ్వర్యంలో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. నవాబుకోట శిబిరాల్లో 50 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ, ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు. అంతకుముందు గ్రామాల్లో అనుమానిత గృహాల్లో కార్డెన్ సర్చ్ నిర్వహించారు.

**కదిరిఅర్బన్:** మండలంలోని కట్లతండా సమీపంలో ఆదివారం వం ద లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం చేసినట్లు రూరల్ సీఐ మోహన్ తె లిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు కట్లతండా సమీపంలో సిబ్బందితో దాడులు నిర్వహించగా, నాటుసారా ఊట ధ్వంసం చేశామన్నారు.

## సోలార్ లైటు చోరీ

**తాడిమర్రి, ఏప్రిల్ 7:** మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలకు కూత వేటుదూరంలోఉన్న వాల్మీకి గోపాల్ తోటలో శనివారం రాత్రి సోలార్ లైటును దొంగలు ఎత్తుకెళ్లారు. వేరుశనగకు రక్షణగా రాత్రిసమయాల్లో ఉంటుందన్న ఉద్దేశ్యంతో సోలార్ లైటును ఏర్పాటు చేసుకోగా దానిని దొంగలు చోరీ చేశారు. దీంతో రైతులు తాడిమర్రి పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ నాగాస్వామి తెలిపారు.

## స్థల వివాదంపై ఘర్షణ

**కదిరిఅర్బన్, ఏప్రిల్ 7:** మండలపరిధిలోని రాచువారిపల్లితండాలో స్థల వివాదంలో రెండు కుటుంబాల మధ్య ఆదివారం ఘర్షణ చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన శంకర్‌నాయక్ ఇంటి స్థలంలో శుభ్రం చేసుకుంటుండగా, అదేగ్రామానికి చెందిన దశరథనాయక్, బాలేనాయక్ స్థలంలో తమకు భాగముందని ఘర్షణకు దిగి శంకర్‌నాయక్, అతని భార్య శాంతమ్మ, కుమారుడు అశోక్‌పై దాడిచేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు దశరథనాయక్, బాలేనాయక్‌లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.